# మాతృ హృదయం

"శాంతా, శాంతా! అత్తయ్య ఏదీ?" అని అడుగుతూన్న అన్నగారి గొంతుక విన్న మాలతి గబగబా కాఫీ కలిపి గ్లాసులో పోసి ఫ్లాంతోసహా ముందు గదిలోకి వచ్చింది. కాఫీ అందిస్తూ, "ఏమిటో వస్తూనే నన్నే అడిగావు" అంది నవ్వుతూ. చదువుతున్న పత్రిక టీపాయ్‌మీద పడేసి శాంత తమ గదిలోకి వెళ్ళిపోయింది. కాఫీ తాగుతూ వెంకట్రావు సావధానంగా, "సుందరం ఎక్కడికి వెళ్ళాడు?" అని ప్రశ్నించాడు. ఆ ప్రశ్న వినగానే మాలతి ఆశ్చర్యపోయింది. సుందరం ఎక్కడికి వెళ్ళాడో తనకేం తెలుసు? ఏదో ఆఫీసులో ఎక్కువ పని ఉంది ఆలస్యంగా వస్తానని చెప్పి వెళ్ళాడు సుందరం తనతో. అదే అన్నగారితో మాలతి చెప్పింది. అన్నగారి ముఖంలోని మార్పులు గమనించిన మాలతి విస్తుపోయింది. సుందరంగూర్చి అన్నగారు ఈమధ్య ఇదే విధంగా ప్రశ్నించడం మాలతి గమనిస్తూనే ఉంది. వాడు పెందరాడే ఇంటికి రావడంలేదుగానీ చదువయిపోయి, చదువుకున్న ఊరులోనే ఉద్యోగం చేస్తున్న మగపిల్లాడు. స్నేహితులతో కలిసి తిరిగితే తప్పా? వాడేమీ బళ్ళోకి వెళుతున్న పిల్లాడు కాదు "ఆలస్యంగా వస్తున్నావేం?" అని నిలదీసి అడిగేందుకు అని ఆలోచిస్తున్న మాలతి, "వాడు ఆఫీసులో పని ఉందని చెప్పాడా?" అని అన్నగారు అడిగిన ప్రశ్నతో ఆలోచనల్ని మాని అవునని తల ఆడించింది.

"నీకు వాడు నిజంగానే ఆఫీసులో ఉన్నాడా, లేదా అన్న అనుమానం కలగలేదా?"

"లేదన్నయ్యా. అనుమానించవలసిన అవసరం ఏముంది? బాధ్యత తెలిసిన పిల్లాడు. అదీగాక మన శాంత వాడికోసం ఇంట్లో ఉండగా వాడు ఆఫీసులో పని అని అబద్ధం ఎందుకు చెబుతాడు?"

వెంకట్రావు అదో రకంగా నవ్వి, "అదే అంటూంట. అది సినిమాకి వెళదామని అన్నాకూడా వాడు రాకపోతే దాని అర్థం ఏమిటి?" అని ప్రశ్నించాడు.

"అయితే వాడు ఆఫీసులో లేడా?" అని అమాయకంగా ప్రశ్నించింది మాలతి.

"మాలతీ, నీ కన్నీ వివరించే ఓపిక నాకు లేదు. నాతో ఒక్కసారి కారులో రా. నే చూపిస్తా" అని అన్నగారు అనగానే "సరే" అని తల ఆడించి అన్నగారితో బయలుదేరింది మాలతి. ఎలాంటి దృశ్యం చూడవలసి వస్తుందోనన్న ఆందోళనతోబాటు అన్నగారిని ప్రశ్నించడానికి ఒకపక్క భయం మాలతికి. కారు న్యూ ఆలీపూరునుంచి లోయర్ సర్క్యులర్ రోడ్డు చేరి అక్కడనించి పార్క్ స్ట్రీటులో ఒక రెస్టారంటు ముందర ఆగింది. కారు తలుపు తెరుచుకుని దిగి అన్నగారు కారు లాక్‌చేసి వచ్చేంతవరకూ ఆగింది మాలతి. వెంకట్రావు ముందరా, మాలతి వెనకగా రెస్టారంటు తలుపు దగ్గిరికి వెళ్ళారు. తలుపు దగ్గిర ఉన్న దర్వాన్ వంగి నమస్కారం పెట్టి తలుపు తెరిచాడు. ఇద్దరూ లోపలికి వెళ్ళారు. పూర్తిగా ఎయిర్‌కండిషన్ చేసిన ఆ రెస్టారంట్ అత్యాధునికంగా అలంకరించబడింది. ఆధునిక నాగరికతా చిహ్నాలన్నట్లున్న స్త్రీపురుషులంతా కాఫీ తాగుతూ, స్నాక్స్ తింటూ కనపడ్డారు. స్టేజిమీద నలుగురు నిల్చుని వాయిద్యాలేవో వాయిస్తున్నారు. ఆ ట్విస్టు మ్యూజిక్‌కి పది పదిహేను



జతలవాళ్ళు డాన్సు చేస్తున్నారు. మాలతి కంటికి మొట్టమొదట కనపడ్డది సుందరం. లయ తప్పక ఆనందంతో ఇంకో అమ్మాయితో ట్విస్టు చేస్తున్న కొడుకుని చూడగానే నిర్ఘాంతపోయి మాలతి బొమ్మలాగ నిల్చుండిపోయింది. కాస్సేపయ్యాక సర్దుకుని అన్నగారి కోటు కొస లాగి బయటికి వెళ్ళిపోదామని సైగ చేసింది.

కారు పార్క్ స్ట్రీటు దాటేంతవరకూ ఇద్దరూ ఏమీ మాట్లాడుకోలేదు. ఆఖరున మాలతి నిశ్శబ్దాన్ని చీలుస్తూ గద్గద కంఠంతో అడిగింది:

"అన్నయ్యా, నీ కంతా ముందే తెలుసునా?"

అది విన్న వెంకట్రావు తెలుసని తల ఆడించాడు.

"అయితే నా కెందుకు ముందరే చెప్పలేదు? ఎందు కిలా హఠాత్తుగా చూపి నన్ను బాధపెట్టావు?"

> *ప్రతి స్త్రీకి, కన్నవారింటిపై మమత ఉంటుంది. కానీ తనూ బిడ్డల్నికన్న తర్వాత, తన బిడ్డలపై మమకారం పెరుగుతుంది. కన్న బిడ్డల శ్రేయస్సుకోసం, తృప్తికోసం కన్నవారింటిపై మమతలను త్యాగం చేయవలసి వస్తుంది. అటువంటి స్థితిలో ప్రతి తల్లిలోనూ మాతృహృదయం మేల్కొంటుంది ...బాంధవ్యాలు ప్రక్కకి తప్పుకుంటాయి.*

అని అడగాలనిపించినా వెంకట్రావుదగ్గర ఉండే భయంవల్ల మాలతి అడుగలేదు.

"నాకు మొదటినించీ అనుమానంగానే ఉంది, మాలతీ. ఉద్యోగంలో చేరిందిమొదలూ వాడు శని, ఆదివారాలు ఫ్లాట్‌లో ఉండకపోయేసరికి అనుమానం కలిగింది. ఎంత పని ఎక్కువైనా అటు వెలు ప్రతి ఆదివారం పని చెయ్యమని ఇక్కడ ఏ ఆఫీసులోనూ, అందులోనూ ఇంజనీర్లని అడగరు. అందులో పిల్ల ఆఫీసులో చాలామంది క్రిష్టియన్లు. ఆదివారం చర్చికి వెళతారు. నాకు మా క్లబ్బులో తెలిసింది, జూట్ మిల్స్ అగర్వాలా కూతురుతో అన్ని ఆదివారాలు వీడు డయమండ్ హార్బరులో అగర్వాలా గెస్ట్‌హౌస్‌లో గడపడానికి వెళ్ళాడని. ఇవాళ వీడు నీతో ఆలస్యంగా వస్తానని చెప్పడం విన్నాను. మధ్యాహ్నం ఆఫీసు వదలగానే వెళ్ళాను. నే వెళ్ళేసరికి అగర్వాల్ కూతురు వాళ్ళ కారులో వచ్చి హారన్ నొక్కేసరికి వీడు వచ్చాడు. ఇద్దరూ కలిసి పార్క్ స్ట్రీటులో రెస్టారెంటుకి వెళ్ళడం చూశాకనే ఇంటికి వచ్చాను. వీడు పెళ్ళి వద్దన్నాడే, దానికి కారణం తెలిసిందా?" అన్నాడు వెంకట్రావు.

మాలతి కంతా అర్థమయింది. శాంతని కాదంటూ డేమో సుందరం అని అన్నగారి బాధ. సుందరం చేస్తున్న పని మాలతికేం నచ్చలేదు. కానీ అన్నగారి ముందర వాణ్ణి తిట్టడమూ ఇష్టంలేదు. వివాహజీవితానికి చిహ్నంగా మిగిలిన ఒక్కగానొక్క కొడుకు.

"ఏమిటో మన కవన్నీ అర్థం కావు. ఈకాలపు పిల్లలు, అందులోనూ కలకత్తా మహానగరంలో పుట్టి పెరిగిన వాళ్ళాయె. . ." అంటున్న మాలతికి అడ్డు వచ్చి, "శాంతమాత్రం ఈకాలపు పిల్ల గాదా? అది ఇలాగే తిరుగుతూందా?" అన్నాడు వెంకట్రావు.

మాలతి మనస్సు చివుక్కుమంది. ఈ సుందరం వల్ల ఈనాడు అన్నగారి ఎదుట దోషిలాగ సంజాయిషీలు చెప్పుకోవలసివస్తోంది కదా అని బాధపడింది. భర్త పోయినపాటినుంచీ పాతికేళ్ళాయి ఆదరించిన అన్నగారిదగ్గర భయమేగానీ చనువు లేని కారణాన్న అన్నగారిని ఎదిరించడం మాలతికి చేతకాదు. ఎందుకు అన్న ప్రశ్న వెయ్యలేదు. అందుకే మెల్లిగా, "వాడు రానీ అన్నీ కనుక్కుంటాను" అని చెప్పి కారు దిగి ఫ్లాట్‌లో తన గదిలోకి వెళ్ళిపోయింది.

ఆ రాత్రి శాంత, అన్నగారు ఇద్దరూ భోంచేసి వాళ్ళ గదుల్లో పడుకున్నారు. మాలతికి ఆకలి లేదు, నిద్రా పట్టలేదు. సుందరం ఇంటికి వచ్చేసరికి గడియారం పదకొండు కొట్టింది. గదిలోకి ఈల వేసుకుంటూవచ్చిన సుందరం తల్లి ఇంకా మేలుకువగా ఉండటం చూసి ఈల ఆపేసి మౌనంగా బొక్కు విప్పి, షూ రాకెట్‌లో పెట్టేసి బట్టలు మార్చుకోవడానికి బాత్‌రూములోకి వెళ్ళాడు.

మాలతికి సంభాషణ ప్రారంభించడానికి అవకాశం దొరికింది. బాత్‌రూములోంచి వచ్చిన సుందరాన్ని ఉద్దేశించి, "భోజనంచేద్దాం, పద!" అంది.

సుందరం ఆశ్చర్యపోయాడు.

"నువ్వింకా భోజనం చెయ్యలేదా, అమ్మా?" అన్నాడు.

"శనివారమే కదా! ఆఫీసులో ఆలస్యమయినా [illegible] రాత్రి వస్తుంటావని వస్తావని కాచుకుని కూర్చున్నాను" అని మెల్లిగా అంది.

"నా కాకలి లేదమ్మా. టిఫిను బాగా తిన్నాను" అన్నాడు సుందరం.

"ఏరా, అయితే ఆఫీసు శనివారం రాత్రికూడా తెరిచేఉంటుందా?" అని ఏమీ ఎరగనట్లు ప్రశ్నించింది మాలతి

"ఊహూఁ. మధ్యాహ్నం పని అయ్యాక స్నేహితులతో ట్రింకాస్‌కి వెళ్ళాను" అన్నాడు సుందరం.

"స్నేహితులంటే ఆడా, మగా?"

సుందరంకి తల్లి ఇలా మాట్లాడటం కొత్త. అందుకే మెల్లిగా, "అదేమిటమ్మా, ఇవాళ ఇలా అడుగుతున్నా?" అన్నాడు.

మాలతి ఇంక ఓర్చుకోలేకపోయింది. ఆవేశంతో "ఎందుకురా ఇన్ని విషయాలు నాకు తెలపకుండా దాచుతున్నావు? ఇవాళ ఆ ట్రింకాస్‌కి మేం రావడం, నిన్నావిధంగా చూడటం అంతా నా ఖర్మరా!" అంది.

సుందరానికి నిజం చెప్పవలసిన సమయం వచ్చిందని అర్థమయింది.

"అమ్మా! ఆ పిల్లపేరు సరోజ్. నువ్వు బాధ పడతావని తెలుసు. కానీ నేను ఆ శాంతని చేసుకోనమ్మా!" అన్నాడు నిదానంగా సుందరం.

మాలతి కోపానికి అవధులు లేకపోయాయి.

"ఏమిట్రా అంటున్నావు! ఇన్నాళ్ళాయి ఆదరించిన మామయ్యని కాదంటావా? శాంతకేం తక్కువైందని?" అంది కోపంగా.

"అమ్మా! శాంత లేదో తక్కువని చెప్పటంలేదు. శాంతకీ నాకూ కుదరదు. నేను సరోజ్‌ని చేసుకోవాలను కుంటున్నాను. చాలా మంచిపిల్ల. అగర్వాలాకికూడా అన్నీ తెలుసు. అతనికీ అభ్యంతరం లేదు. . ." అంటున్న సుందరాన్ని మాట పూర్తిచెయ్యనివ్వకుండానే మాలతి అంది:

"సుందరం, ఆ పిల్లతండ్రికి అభ్యంతరం లేదంటూ గొప్పగా చెప్పుతున్నావుగానీ నీకూ ఒక అమ్మ ఉందన్న విషయం మరిచిపోయావు కదా!"

"లేదే, అమ్మా. నీ కిష్టం లేకపోతే ఈ పెళ్ళి జరగదు. సరోజ్‌కీ ఈ విషయం తెలుసు. కానీ శాంతని మాత్రం నే చేసుకోను. చేసుకోమని నువ్వు బలవంతం చెయ్యకమ్మా!" అని బాధతో ప్రాధేయపడ్డాడు.

తన కిచ్చిన విలువకి మాలతి కరిగిపోయింది. కానీ చూస్తూ చూస్తూ ఒక్కగానొక్క కొడుకు ఎవరినో పెళ్ళాడతాడంటేమాత్రం మనస్సంగీకరించలేదు. శాంతని కాదని ఇన్నాళ్ళాయి ఆదరించిన అన్నగారికి ఎదురుతిరగటం మంచిదికాదని మనస్సుని గట్టిగా చేసుకుని దృఢంగా చెప్పింది.

"నువ్వు చాలా పెద్దవాడివై పోయావురా, సుందరం! ఇంట్లో పెద్దవాళ్ళున్నారన్న విషయం మరిచిపోయి నీ నిర్ణయాలు నువ్వు చేసుకుంటున్నావు. నువ్వేలాగ అనుకున్నావురా, ఈ పెళ్ళికి నేను ఒప్పుకుంటానని? ఇన్నాళ్ళాయి ఆదరించిన మేనమామని కాదనడానికి సాహసం నీ కెలాగ కలిగిందిరా? శాంతని చేసుకుంటే మన ఋణం తీర్చుకోగలమని నీకు తెలవదట్రా?"

అంతా విని సుందరం నిదానంగా, దృఢంగా చెప్పాడు:

"అమ్మా, నువ్వు కాదూ కూడదూ అంటే సరోజ్‌ని నే పెళ్ళి చేసుకోను. కానీ శాంతనిమాత్రం నే పెళ్ళి చేసుకోను. మామయ్య కృతజ్ఞత అనకు. ఋణం తీర్చుకోవాలంటే వేరే విధానాలున్నాయి. పెళ్ళి ఒక్కటే గాదు. అదీగాక మామయ్య ఏం ఊరికే సాయం చెయ్యలేదు. మన భూమిమీద వస్తున్న శిస్తూ తనేగా తీసుకుంటూంట! అర్ధరాత్రి దాటింది. ఇంక పడుకుందాం."

దీపాన్ని ఆర్పి మంచంమీద తల్లికి కొంచెం దూరంగా పడుకున్నాడు. కానీ ఇద్దరికీ ఆ రాత్రి శివరాత్రే అయింది.

ఆదివారం పొద్దుట బ్రేక్‌ఫాస్టు టేబిలుదగ్గర మేనమామకీ, మేనల్లుడికీ పెద్ద ఘర్షణే జరిగింది. సుందరం శాంతని చేసుకోనని గట్టిగా చెప్పి లేచి వెళ్ళిపోయాడు. అన్నగారు వేసే కేకల్ని వినలేక మాలతి వంటింట్లోకి వెళ్ళి కళ్ళనీళ్ళు పెట్టుకుంది.

అనాటినించీ రోజూ భోజనాలదగ్గర వెంకట్రావు మాలతికి ఆశ్రయం ఇచ్చి తనెంత కష్టపడి సుందరాన్ని పెద్దవాణ్ణి చేశాడో అదీ, ఉద్యోగంలో చేరాక తన అవసరం తీరిపోయింది కదా అని సుందరం ఇలా చేస్తున్నాడో ఏకరువుపెట్టడం మొదలుపెట్టాడు.

ఆ రోజూ మధ్యాహ్నం భోజనాల దగ్గర అలాగే చెప్పుకుపోతూన్న వెంకట్రావు వెనకాలే సుందరం వచ్చి నిలుచున్న విషయం గమనించక చెప్పుకు పోతున్నాడు. "ఎవరిని అని ఏం లాభం? వాళ్ళ వాళ్ళ అవసరాలు తీరాక మనం సహాయం చేశామన్న సంగతి మరిచిపోతారు." అలా అంటున్న మేనమామతో సుందరం: "మామయ్యా! నువ్వేం ఊరికే చేశావా? నాన్నగారి భూములమీద శిస్తు అంతా తీసుకుంటూనే ఉన్నావు. జీతం బత్తెం లేని చాకిరీకి అమ్మ ఉండనే ఉంది" అని హేళనగా అంటూ తన గదిలోకి వెళ్ళిపోయాడు.

చేతిలోని పులుసుగిన్నెని టేబిలుమీద పెట్టేసి మాలతి సుందరం వెనకాలే వెళ్ళింది.

"సుందరం, ఎందుకురా అంత నోటి దురుసుతనం! ఎందుకు పెద్దవాళ్ళ నలా ఎదిరిస్తావు?" అని

'విశాఖ'

(తరువాయి 44 వ పేజీలో)



తీరదూరాలు
ఫోటో—ఎస్. ఎన్. రావు (మద్రాసు-28)

( 32 వ పేజీ తరువాయి)

అడిగింది మాలతి.

సుందరం ఏమీ మాట్లాడలేదు.

"సుందరం, చిన్నప్పటినించీ పెంచాడు. వాడికి చూపించవలసిన మర్యాద చూపించకుండా ఇంకా ఎదిరించటం మర్యాద కాదు. నువ్వు చదివిన చదువుల్లో పెద్దవారిని ఎదిరించమనే ఉందా? నువ్వు చేసుకోకపోతే శాంత కింక పెళ్ళి కాకపోదు. మామయ్యమీద ఎగిరెగిరి పడతావేం?" అంటూ కోపంగా అడిగింది.

మాట్లాడకుండా సుందరం, షై విప్పేసి షర్టు విప్పే ప్రయత్నంలో ఉండగానే వెంకట్రావు ఆ గదిముందరికి వచ్చి గట్టిగా, "అదే నేనూ చెప్పదలుచుకున్నాను. ఇంట్లో అరిటిచెట్టు పనికివచ్చేదే అయినా కంటికి ఆనదంటారు. అలాగే శాంత ఇంట్లో ఉన్నా ఈయనగారి కంటికి ఆనలేదు. చదువులు వెలగబెట్టి ప్రయోజకుడే అయ్యాడు. నన్నెదిరించేంత ఘనుడయ్యాడమ్మా, మాలతీ!" అంటూ విసురుగా వెళ్ళిపోయాడు.

సుందరం తల్లి ముఖంకేసి చూసి ఏమీ మాట్లాడకుండా మౌనంగా ఉండిపోయాడు.

మాలతి నేత్రాలు సజలాలయ్యాయి. "ఏరా, సుందరం? మీ నాన్నగారు పోయినప్పటినించీ అన్నయ్యే నన్ను ఆదరించాడని నీకు తెలుసు కదా! నీ చదువు విషయం ఉద్యోగం విషయం అన్నీ చూసుకున్నాడు. అలాంటి మామయ్యని నువ్వు ఎదిరిస్తావా? నన్ను ఇలాకూడా బతకనివ్వవా?" అని ప్రాధేయపడింది.

"అమ్మా! మామయ్య విషయం పూర్తిగా నీకు తెలియదు. నేను చెప్పినా నువ్వు నమ్మవు. నేనేదో అబద్ధాలాడుతున్నానని అనుకుంటావు. ఇంజనీరింగు సీటుకి ప్రయత్నించాడని నువ్వు అనుకుంటుంటే, నేనేం చెప్పలేదు. మా స్కూల్లో నా స్నేహితుడు అశోక బెనర్జీ వాళ్ళ నాన్న ఇంటర్వ్యూ చేసేవారిలో ఒకరు. అందువల్లే అశోకబెనర్జీ నాకు సాయం చెయ్యగలిగాడు. ఇంజనీరింగులో చేరాకే కాస్త నాతో కబుర్లు చెబుతా. డిగ్రీ వచ్చాక ఉద్యోగంకోసం ప్రయత్నిస్తూ మామయ్యని సిఫారసు చెయ్యమంటే "ముందర పెళ్ళి అవనియ్యవోయ్. ఉద్యోగానికేం తొందర? పెళ్ళయ్యాక ఉద్యోగం వేయిస్తానులే!" అన్నాడు. అంటే, నేను శాంతని చేసుకుంటే ఆ తరవాత ఉద్యోగం ఇప్పిస్తాడన్నమాట! అశోకబెనర్జీ వాళ్ళ నాన్న జూట్ మిల్స్ అగర్వాలాకి చెప్పి రికమెండు చేసి నాకీ ఉద్యోగం ఇప్పించారు" అన్నాడు.

మాలతి కంతా అయోమయంగా కనిపించింది. అయితే తన అన్న స్వార్థపరుడా? పైకి ఒక రకంగా, లోపల ఒక విధంగా ఉంటాడా?

"సుందరం, చేసిన మేలు మరిచిపోకురా! మామయ్య మీద ఇన్ని అభాండాలు వెయ్యకు. ఇన్ని అబద్ధాలు చెప్పడం ఎప్పుడు నేర్చుకున్నావు?" అంది మాలతి.

"అమ్మా! అబద్ధం ఆడవలసిన అవసరం నాకు లేదు. కానీ రోజూ నే నింటికి వచ్చేసరికి ఇలా గొడవలు పెడుతూంటే నేను ఈ ఇంటిని వదిలి వెళ్ళవలసివస్తుంది. నువ్వూ నాతోబాటు వచ్చెయ్య" అన్నాడు సుందరం.

మాలతి ఏం మాట్లాడ లేదు.

"అమ్మా, నువ్వు వస్తే మనం ఇప్పుడే వెళ్ళిపోదాం. ఇన్నేళ్ళూ మనల్ని ఉంచుకున్నందుకు మామయ్యకు కృతజ్ఞులంగా ఉండాలి. కానీ మామయ్య చెయ్యనివన్నీ చేశాడనీ, దేవుడనీ కొలవమంటే నాకు చేతకాదు. మనల్ని ఉంచుకున్నదానికి ఫలంగా దేవుడు శాంతకి మంచి మొగుణ్ణి ప్రసాదిస్తాడు. మనం ఇక్కణ్ణించి వెళ్ళిపోదాం, అమ్మా!"

"సుందరం! నువ్వనుకున్నంత తేలిక కాదు. అన్నయ్యని ఎదిరించే శక్తి నా కింకా లేదు."

"అమ్మా! శాంతనీ, నన్నూ నువ్వే పెంచావు. మా ఇద్దర్నీ కూతురూ కొడుకుగా ఆలోచించుకో గూడదా?"

"ఏమిటోరా! ఇన్నేళ్ళాయీ కలిసిఉండి ఇప్పుడు వెళ్ళిపోతే నలుగురు ఏమనుకుంటారో అని నీకు అనిపించటం లేదూ?"

"సరే నీ ఇష్టం. రోజురోజుకీ ఈ ఇల్లు నరకంలా తయారవుతూంటే, నేనేమైనా తప్పులు చేస్తే నువ్వే ఓర్చుకోవాలి." అంటూ బాత్‌రూమ్‌లోకి వెళ్ళి తలుపు గట్టిగా వేసేసుకున్నాడు.

మాలతి మనస్సు వికలమై పోయింది. భర్త పోయిన దగ్గిరనించీ ఏమిటో గొడవలు లేకుండా సాగిపోతున్న జీవితం మళ్ళీ ఇలా ఒడుదుడుకుల్లో పడుతుందని అనుకోలేదు మాలతి. 'ఒక్కడే కొడుకు. చెప్పినమాట వింటాడు' అనుకుంది తను. పెళ్ళి జరిగిన ఏడాదికే తను వివాహజీవితం నించి ఏం ఆశించిందో అది పొందనేరదని తెలుసుకుంది. తన భర్త తనని పెళ్ళి చేసుకున్నందున భరిస్తున్నాడే గాని వేరే అనురాగం లేదు అని తెలుసుకుంది. పనివాళ్ళున్నారు. కారుంది. అన్నీ ఉన్నాయి. కానీ భర్త ప్రేమ మాత్రం చవిచూడలేదు. కానీ భర్త తనని ద్వేషించనూ లేదు. ఏదో అలాగే పసుపు కుంకుమలతో నాలుగు కాలాలపాటు ఉంటే చాలనుకుంది. నెల తప్పగానే తన జీవితానికి ఒక ఆధారం, ఒక ఆశ తన పిల్లాడి రూపంలో దొరుకుతుందని సంతోషించింది. కానీ ఆ భయంకర రాత్రివేళ తన భర్త నిస్తున్న టీవు ప్రమాదానికి గురి అయ్యాక ఆ పసుపు కుంకుమలకు కూడా నోచుకోలేదు. భర్త పోయాక శూన్యమనస్క అయి, అన్నగారింటికి వచ్చాక, ఆశామోహాలకు సుఖదుఃఖాలకు అతీతంగా ఉంటూ వచ్చింది.

కానీ కొడుకు సుందరం పెద్దవాడు అవుతున్నకొద్దీ మళ్ళీ ఆశలు కొత్త చిగుళ్ళు వేశాయి. సుందరానికి చదువు బాగా వచ్చేసరికి శాంతని కోడలుగా చేసుకుని మనవల్ని ఎత్తుకోవాలన్న కోరిక బీజం వేసి మొలకెత్త సాగింది. ఈనాడు మళ్ళీ తన కోరిక వ్రేళ్ళతో సహా తీసిపారెయ్యమంటే మాలతిమనస్సు బాధతో మూలిగింది. సుందరం క్లాసులో బహుమతి తీసుకుంటున్నాడంటే చూసి ఆనందించడానికని మొట్టమొదట కలకత్తానగరవీధుల్లో అడుగు పెట్టింది. అప్పటినించీ శాంతనీ, సుందరాన్నీ తీసుకుని తెలుగు సినిమాలకీ, లేక్సుకీ అన్నింటికీ వెళ్ళడం ప్రారంభించింది. శాంత పుట్టిన కొత్తలో వదిన పోయినందువల్ల శాంతనీ తనే పెంచింది. అదే శాంతంటే అభిమానానికి కారణం.

ఆలోచనా ప్రపంతిలో మునిగిన మాలతికి సుందరం బయటికి వెళ్ళటం తెలీలేదు. అలాగే కూర్చుండి పోయింది. బజ్జర్ నొక్కిన శబ్దం విని ఉలిక్కిపడి లేచి వెళ్ళి తలుపుతీసి చూసింది. దూధ్‌వాలా పాలతో వచ్చి నిలుచున్నాడు. పాలు పుచ్చుకుని గృహకృత్యాలలో మునిగిపోయిన మాలతికి ఆలోచనలకు అవకాశం లేకపోయింది. రాత్రి భోజనాలకి సుందరం రాలేదు. మధ్యాహ్నంకూడా తినకుండా వెళ్ళాడే అన్న బాధతో ఆ మాతృహృదయం మూలిగింది. అందరూ నిద్రపోయారే గానీ మాలతికి మాత్రం నిద్ర రాలేదు. సుందరం ఏమయ్యాడో అన్న భయం. అన్నగారిని కనుక్కుందామంటే మళ్ళీ ఏ కటువచనాలు వినవలసి వస్తుందోనన్న భయం మాలతి బాధనంతా ఏకాంతంగా భరించవలసి వచ్చింది. శాంతకి మొదటినించీ తన పుస్తకాల్లో తల దూరిస్తే బయటప్రపంచంలో ఏం జరిగినా తెలియదు. దేనిలోనూ ఆసక్తి లేదు. దేనిమీదా కోరిక లేదు. అదొకవిధమైన విరాగినిలా ఉంటుంది. శాంతకు మాలతి ఆత్మమనస్సులో చెలరేగే తుఫాను అర్థం చేసుకుందామన్న ఆసక్తిగానీ, అర్థం చేసుకునే శక్తిగానీ లేవు.

మాలతికి మొదటినించీ ఏకాంతం అలవాటే. మాలతి పనులన్నీ ముగించుకుని తన గదిలో పడుకుంది. ఆలోచనలుకూడా స్తంభించిపోయాయి. శూన్యమనస్క అయి పడుకుంది. గడియారం శబ్దం మినహా అంతా నిశ్శబ్దంగా ఉంది. మేడమీద ఉన్న బెంగాలీవాళ్ళు కాశీకి వెళ్ళినందువల్ల మేడమీదకూడా నిశ్శబ్దంగా ఉంది. అలిసి ఉన్న మాలతికి నిద్ర పట్టేసింది. చటుక్కున మెలకువ వచ్చేసరికి గోడగడియారం గంటలు కొడుతూంది. మాలతి లెక్క పెట్టింది. పన్నెండు కొట్టింది. మాలతికి ఇంక నిద్ర పట్టలేదు. తెలివిగా కూర్చుంది. సుందరం ఇంకా రాలేదే అని కిటికీలో

నించి బయటికి చూసింది. అప్పుడప్పుడు వెళుతున్న కార్లశబ్దం తప్పించి వేరే కదలికే లేదు. సుందరం దగ్గిర ఫ్లాట్ తాళాలున్నాయి. వాడే తలుపు తీసుకు రాగలడు. కానీ మాలతికి నిద్ర పట్టలేదు. సుందరం వచ్చేసరికి రెండూ దాటింది. కళ్లు ఎర్రగా ఉన్నాయి. వస్తూనే మంచంమీద పడుకున్నాడు. మాలతికి అనుమానం వేసి దగ్గిరగా వచ్చింది. వాసనబట్టి సుందరం తాగి వచ్చాడని తెలుసుకుంది. మాలతికి ప్రపంచం తిరగటం మానేసినట్లనిపించింది. కళ్లు రెండు చెరువులయ్యాయి. దీన్ని చూడ్డానికా ఇన్నాళ్లూ తను కష్టపడుత? తండ్రి పోలికలే వీడికి వస్తున్నాయి. ఇద్దరికీ మనోదార్ఢ్యం లేదు. తండ్రి ఎలాగ, అనుకున్నది జరగకపోయేసరికి తాగుడు అలవాటు చేసుకున్నాడో, అలాగే సుందరంకూడా చేసుకుంటున్నాడా? ఇదే మొదటిసారా? ఇంత క్రితంకూడా వీడికి ఈ అలవాటు ఉందా? ఏమీ అర్థంకాక ఏం చెయ్యాలో తెలవక బొమ్మలాగ నిల్చుండిపోయింది. మాలతికింకా బాగా జ్ఞాపకం. తన పెళ్లి నిశ్చయమవగానే తండ్రి ఎంతో సంతోషించాడు. టీ ఎస్టేటులో పెద్ద ఉద్యోగం. పిత్రార్జితం మువ్వయి ఎకరాల భూమి కోనసీమలో ఉంది. కట్నం ఏమీ అక్కరలేదని చెప్పారు. పెళ్లయి భర్తతో వెళ్లాకే తెలిసింది కట్నం అదీ వద్దని గొప్పవాళ్లు తనని ఎందుకు చేసుకున్నారో!

ఎన్నో ఆశలతో, ఎన్నో ఊహలతో, సిగ్గుతో, సంకోచంతో భర్తదరి చేరిన మాలతికి భర్తనించి తా వాశించినదేమీ దొరకదని తెలుసుకోవడానికి ఆట్టే కాలం పట్టలేదు. మంగళసూత్రం కట్టినందువల్ల తన బాధ్యతల్ని నెరవేర్చుకోవడమేగాని మనస్సు విప్పి మనస్సు పుచ్చుకోవడం లేదన్న సంగతి తెలవగానే, కన్నె కలలన్నింటికీ స్వస్తివాక్యం పలికినా, మాలతి మనస్సు బాధ పడింది. స్త్రీలకు ఉన్న ఓర్పుతో ఏ నాటికైనా తన భర్త తనను మంగళసూత్రపు బంధంగా గాక మాలతిగా గుర్తిస్తాడన్న ఆశతో జీవించసాగింది. కానీ ఒక రోజు భర్త తాగిన మైకంలో మాట్లాడుతూ "అపర్ణ, అపర్ణ" అంటూ అనేకసార్లు అనటం విని మెల్లిగా ప్రశ్నించి విషయాలన్నీ తెలుసుకుంది. అపర్ణ టీ ఎస్టేటు దాస్‌గుప్తాగారి అమ్మాయి అపర్ణా, తన భర్తా పెళ్లి చేసుకుందామనుకున్నారు. కానీ తన అత్తగారూ మామగారూ బెంగాలీల పిల్లని చేసుకోవడానికి నిరాకరించారు. వృద్ధాప్యంలో వాళ్లని కష్టపెట్టడంగానీ, ఎదిరించడంగానీ చేతగాక భర్త ఊరుకోగానే ఎక్కడ ఆ బెంగాలీలపిల్లని చేసుకుంటాడో నన్న భయంకొద్దీ కట్నంకూడా వద్దని మాలతిని కోడలుగా చేసుకున్నారు. అపర్ణని పెళ్లి చేసుకోక పోయినా పరవలేక, మానసికంగా బలహీనుడు అయిన తన భర్త, తాగుడుకు బానిస అయ్యారు.


మాలతికి ఇప్పుడు ఆ భయంకరరాత్రి జరిగిన ప్రతీ చిన్న విషయమూ జ్ఞాపకం. అప్పుడు సుందరం మూడో నెల కడుపు. ఆ రాత్రి భర్త ఇంకా రాకపోయే సరికి ఎదురుచూస్తూ కూర్చుండిపోయింది. బిహారీ ఇంటికి వెళ్లిపోయాడు. రాఖాల్ సర్వెంటుక్వార్టర్సు లోనే ఉన్నందువల్ల రాఖాల్ భార్య విష్ణుప్రియ సాయంవచ్చి కూర్చుంది. తెల్లవారగట్ల మూడింటికి పోలీసుస్టేషను నించి టెలిఫోను వచ్చింది. భర్త వస్తున్న జీపు ప్రమాదానికి లోనయినందువల్ల పోలీసు స్టేషనుకి వస్తే ఆస్పత్రికి తీసుకువెళదామని. విష్ణుప్రియ వెళ్లి డ్రైవరు సింగుని లేపి తీసుకు వచ్చింది. కారులో పోలీసుస్టేషనుకి వెళ్లి అక్కడినించి ఆస్పత్రికి వెళ్లేసరికి ప్రభాతసమయపు లేత ఎండ హాస్పిటల్ వరండా అంతా వ్యాపించి ఉంది. కానీ ప్రభాతసమయంలోనే మాలతి జీవితం అంధకార మయింది.

వార్డులో మంచంమీదున్న భర్త "మాలతీ! నేను నీతో చనువుగా ఉండకపోయినా భర్తగా అప్పుడప్పుడు మృగసమానంగా ప్రవర్తించేవాడిని కదూ! నా తల్లి నన్నింత బలవంత పెట్టకుండా ఉండిఉంటే అపర్ణని చేసుకోకపోయినా నిన్ను చేసుకుని ఇలా బాధ పెట్టేవాణ్ణి కాదు. నాకు ఆ ధైర్యమే ఉండిఉంటే నీ జీవితం ఇలా పాడయ్యేది కాదు. నువ్వు ఇప్పుడు పట్టే మనిషివికూడా కాదు. నీ ఆరోగ్యం కాపాడుకో. నాకు తెలుసు. నా లాంటి కొడుకే పుడతాడు. వాణ్ణి ఏ విషయంలోను బలవంత పెట్టకు. ముఖ్యంగా పెళ్లి విషయంలో. నిరాశ మానవుణ్ణి చెడ్డఅలవాట్లకి గురి చేస్తుంది. నాకు అమ్మా నాన్నల్ని ఎదిరించే ధైర్యమే ఉండి ఉంటే, అనుకున్నది జరగకపోయినా తట్టుకోలేక మనోదార్ఢ్యమే ఉండిఉంటే నేని బలహీనతకు లోనయ్యే వాణ్ణికాను. తల తిరిగినట్లయింది. ఎక్కువ తాగాను కాబోలు. హెయిర్‌పిన్ బెండ్ ఉన్న సంగతి చూసుకో లేదు. జీపు పట్టు తప్పింది. ఆడదానివయినా నీకు నా కన్నా ధైర్యం ఎక్కువ. బాబుని జాగ్రత్తగా పెంచు" అంటూ కళ్లు మూశారు.

ఈ నాడు మళ్లీ సుందరం తాగి వచ్చాడు. ఎన్నిసార్లో భర్తకి బోళ్లు అవీ తీసి సరిగ్గా పడుకో బెట్టింది. ఈ నాడు మళ్లీ సుందరానికి అవి మళ్ళీ చేసింది. మాలతికి భర్తమాట పదేపదే జ్ఞాపకం వచ్చింది. సుందరంకూడా తన భర్తలాగే అయిపోతాడేమోనన్న భయం వేసింది మాలతికి. ఆ సరోజకూడా అపర్ణలాగే అవివాహితగా ఉండిపోతుందా? సుందరానికి శాంతకీ పెళ్లి చేస్తే శాంతకూడా తనలాగే అవుతుందా?

సుందరం, తండ్రి అంత దుర్బలుడు కాడు. శాంతని పెళ్లిచేసుకోడు. కానీ తండ్రిలాగే తాగుడుకి బానిస అయిపోతే తన జీవితంలోని ఈ చిన్నవెలుగూ అస్తమించిపోతుంది. రేపు నలుగురూ సుందరం తాగుబోతంటే తనకి అవమానం కాదా? మార్వాడీ పిల్లని చేసుకుంటేనే అవమానమా?

అయితే అన్నగారిని ఎదిరించేశక్తి తనకుందా? సుందరం మామూలుగా ఉండాలంటే సుందరం ఈ ఇంటినించి వెళ్లిపోవాలి. సుందరం వెళ్లిపోతే తనీ ఇంట్లో ఎవరి కోసం ఉండాలి? అదీగాక సుందరం అన్నివాటిల్లో నిజం తెలపలేదేమోనన్న సంశయం పీడిస్తూనే ఉంది. అదే నిజమయితే సుందరం శాంతని చేసుకోక బయటికి వెళ్లిపోతే అన్నగారు తనని ఆదరిస్తాడా? అన్నగారికి తనమీద జాలి ఉంటే ఆనాడలా ఆ రెస్టారెంటుకి తీసుకెళ్లి తన గుండెల్ని బాధపెట్టే దృశ్యం ఎందుకు చూపిస్తాడు? చెప్పేతే చాలుగదా! అయినా సుందరానికీ, శాంతకీ ఎలా కుదురుతుంది? సుందరానికి టెన్నిస్సూ, టెన్నిస్సూ,



దూరతీరాలు

ఫోటో—ఎస్. ఎస్. రావు (మద్రాసు-28)

శాంతకి కర్ణాటక సంగీతము, పుస్తకాలూ కావాలి. శాంత ఒక్కనాటికీ సుందరంతో ట్రింకాన్‌కీ వెళ్లి వాడికి తగ్గట్టు నడుచుకోనేరదు. అది శాంతని పెంచిన తనకి తెలుసు. శాంత అసలు తాబేలు లాగా నెమ్మదిగా అన్నీ చేసుకుంటుంది. ఏదేనా అడ్డువస్తే పుస్తకాల్లో తల దూర్చేసుకుంటుంది. అందుకే వెంకట్రావు శాంతని తనకి కోడలు చెయ్యాలని చూస్తున్నాంట. బయటివారయితే శాంతని నానా కష్టాలూ పెడతారు. అత్తగారింట్లో పుస్తకాలతో రేడియో పక్కన కూర్చుంటే ఎవరూ ఊరుకోరు. శాంతని తనేగా పెంచింది. శాంతని కోడలుగా కాక కూతురుగా చూసుకుంటేనేం? భర్తమాటలు పదే పదే జ్ఞాపకం వచ్చింది. ఒళ్లు ఎరగక నిద్ర పోతున్న సుందరాన్ని చూసేసరికి మాలతి మాతృహృదయం ద్రవించింది. తను వద్దంటే సరోజని వాడు చేసుకోడు. తనంటే వాడికి ఎంత ఆపేక్ష? తన మాట కాదన నేరడు. కానీ చూస్తూ చూస్తూ తన కొడుకు పతనమై పోతూంటే తల్లిగా తాను ఊరుకోగలదా? మనస్సులో పోరాటంలో మాలతి మాతృహృదయమే నెగ్గింది. నాలుగు కాలాలపాటు వాడు సుఖంగా ఉంటే అదేచాలు. వాడి కిష్టమైన పిల్లనే చేసుకోనీ అన్న దృఢనిశ్చయంతో లేచి పెట్టెల్ని సర్దసాగింది. కిటికీ లోంచి ప్రభాత సమయపు లేత ఎండ లోపలికి వచ్చింది. మాలతి సుందరాన్ని తట్టి లేపి "ఈ ఇంటినించి వెళ్లిపోదాం" అన్న తన నిర్ణయం తెలపాలనిపించింది. కానీ పసిపాపలాగ నిదురిస్తున్న సుందరాన్ని లేపడానికి మనస్కరించక బట్టలు అవీ సర్దసాగింది. ★